ప్రజాశక్తి

సోమవారం 3 ఫిబ్రవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



తీగ లాగినా.. కదలని డొంక!

- సింహాచల దేవస్థానం భూమి పక్కాగా 39ఎకరాలే...
- సుమారు 11వేల ఎకరాలపై సాగిస్తున్న పెత్తనం
- 'పంచగ్రామా'లపై 'కూటమి' పాలనలోనూ ఇదే తంతు..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గడచిన 30ఏళ్లుగా విశాఖలోని పంచగ్రామాల సమస్య పరిష్కారానికి విముక్తి లభించక అటు ప్రజలు, ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్న సంగతి తెలిసిందే. అడవివరం, వెంకటాపురం, వేపగుంట, పురుషోత్తపురం, చీమలాపల్లి అనే 'పంచగ్రామాల' పరిధిలో సింహాచలం దేవస్థానం భూమి 1903నాటి గిల్‌మెన్ రికార్డుల ప్రకారం కేవలం 39.5 ఎకరాలే. అయినా 11వేల ఎకరాల పైచిలుకు ప్రజలు, రైతుల భూములపై దేవస్థానం కర్రపెత్తనం సాగిస్తోంది. ఈ పెత్తనం పోతే దేవస్థానం అధికారుల భోగవిలాసాలు పోతాయి. ఈ దేవస్థానం (సింహాచలం) ఆలయ చైర్మన్‌గా విజయనగరం పూసపాటి వంశీయులు (ప్రస్తుతం అశోక్‌గజపతిరాజు) వ్యవహరిస్తూ ఉన్నారు. పక్కాగా రికార్డుల ఆధారాలు అన్నీ ఈ పంచగ్రామాల ప్రజలు, రైతులదని తెలియజేస్తున్నా కోర్టుల్లో దావాలు పడుతున్నాయి. పూసపాటి వంశీయులు పట్టు బిగిస్తున్న కారణంగా ప్రజలకు దక్కకుండా పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి పార్టీల నేతలు ఆలయ ధర్మకర్త మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజుతో సైతం చర్చించి పరిష్కారానికి ఒప్పించినట్లు జరుగుతోన్న ప్రచారం తెలిసిందే.

అసలేం జరిగిందంటే....

'పంచగ్రామాల' ప్రాంతంలో 1996-97 సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం రైత్వారీ పట్టాలు దేవస్థానానికి మంజూరు చేసింది. అప్పటివరకూ ఎలాంటి సర్వేలు జరగలేదు. ఈ పట్టాల ఆధారంగా 2006 ఆగస్టు 19న 57 జీవోను ఆ తర్వాత ప్రభుత్వం ఇచ్చింది. ఈ జీవోపై హైకోర్టులో దావా వేయడం జరిగింది. హైకోర్టు విచారణ అనంతరం సమస్య పరిష్కారానికి ఆర్‌డిఒను సంప్రదించాలంటూ కోర్టు సూచించింది. ఆ సమయంలో ఆర్‌డిఒను సంప్రదించగా ఆర్‌డిఒ కోర్టులో ఈ పట్టాలు చెల్లవని స్పెషల్ డిప్యూటీ ఆఫ్ ఇనామ్స్‌చే విచారణ జరపాలని ఆదేశించారు. ఈ విచారణకు 1903 గిల్‌మెన్ రికార్డులను ఆధారంగా సమర్పించారు. సింహాచలం దేవస్థానం ఆ సమయంలో ఎలాంటి రికార్డులూ సమర్పించలేదు. ఐతే విచారణ లోతుగా జరిగితే ఆ భూములు దేవాలయానికి చెందకుండా పోతాయని దేవస్థానం అధికారులు మరలా హైకోర్టుకు వెళ్లి ఈ కేసుపై స్టే ఆర్డర్ తెచ్చారు. ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా విచారణ జరపాలని 2017లో హైకోర్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇనామ్స్‌కు సిఫారసు చేసింది. ఈ విచారణ ఇప్పటికీ పెండింగులోనే ఉండడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. ఐతే ఒకానొక సందర్భంలో డిప్యూటీ తహశీల్దార్ ఇనామ్స్ దీనిపై న్యాయమైన తీర్పు ఇవ్వాలంటే ప్రజలు, రైతులకు అనుకూలంగా ఇవ్వాల్సి వస్తుందని ఇదే జరిగితే దేవస్థానం అధికారులు, రాజకీయ ఒత్తిడులు తప్పవని

మిగతా 2లో..

ముగిసిన ఆర్థోవైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సు

ఎపి ఆర్థో సర్జన్ల సొసైటీ అధ్యక్షునిగా అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, ఆంధ్ర మెడికల్ కళాశాల, కింగ్ జార్జ్ ఆసుపత్రి ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యాన ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి.శివానంద పర్యవేక్షణలో ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు (ఒసాప్కాన్-2025) ఆదివారం నాలుగో రోజు ఘనంగా నిర్వహించారు. నగరంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఏరీనాలో జరిగిన ముగింపు కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్థోవైద్యులు డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ, కీళ్ల మార్పిడి, వాటి అరుగుదల, అందుబాటులో ఉన్న నూతన వైద్య విధానాలు, శస్త్ర చికిత్సలపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కీళ్ల మార్పిడికి సంబంధించి ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే తగిన ఇబ్బందులు లేకుండా జీవనం సాగిచవచ్చన్నారు. ప్రముఖ ఆర్థో డాక్టర్ కృష్ణకిరణ్ మాట్లాడుతూ, జాయింట్ రీప్లేస్మెంట్, హిప్ రీప్లేస్మెంట్ విభాగాలపై కూడా వైద్యులు, వైద్య విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు.

నాలుగు రోజులు పాటు జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆరు లైవ్ సర్జరీలు, ఐదు వర్క్ షాపులు నిర్వహించగా 150 మంది వైద్య నిపుణులు, వెయ్యి మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు ముగింపు సందర్భంగా ఆర్గనైజింగ్ చైర్మన్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద సదస్సు సందేశం ఇచ్చారు.

అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీ నూతన అధ్యక్షునిగా సిద్ధార్థ మెడికల్

మిగతా 2లో..



రాష్ట్ర స్థాయి సదస్సు ముగింపులో పాల్గొన్న ఆర్థో వైద్య నిపుణులు

స్నేహభావం, శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలి
వార్తలు 4లో..

పోర్టు ఆసుపత్రి టెండర్లకొస్తే తరిమికొడదాం
వార్త 4లో..

కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు అన్యాయం : సిపిఎం నిరసన
వార్త 8లో..

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆందోళన
వార్త 5లో..

రాజ్యాంగం స్థానంలో...

మనుధర్మం ప్రవేశపెట్టే కుట్ర

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

భారత రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని ప్రవేశ పెట్టేందుకు కేంద్రంలోని బిజెపి పాలకులు ప్రయత్నిస్తున్నారని, అత్యంత ప్రమాదకరమైన ఈ చర్యను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఏకలవ్య కాలనీలో నెల్లిమర్ల అమరవీరుల 31వ స్మారక సభ నిర్వహించారు. ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా పాలకవర్గాలు అనేక మోసపూరిత విధానాలను అమలు చేస్తూ కార్మిక, ప్రజల హక్కులను కాలరాస్తూ వచ్చాయన్నారు. దశాబ్ద కాలంగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతృత్వంలో మౌళికంగానే విధానాలను మార్చే పనికి పూనుకున్నారని విమర్శించారు. ఆ క్రమంలోనే 4 లేబర్ కోడ్‌లను, 3 నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చారన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆస్తులను కార్పొరేట్ వ్యక్తులకు కారు చౌకగా కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అటవీ ప్రాంతాలను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చట్టాలను మారుస్తున్నారన్నారు. ప్రశ్నిస్తున్న ఆదివాసీలపైనా, వారికి అండగా నిలబడిన విప్లవ సంస్థలు, మేధావులపైనా ఆపరేషన్ కదా పేరుతో ఏకపక్షం చేస్తున్నారని ఆరోపించారు. విద్యా వ్యవస్థను కాషాయీకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేసి బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే కుట్రకు పూనుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు సీనియర్ నాయకులు వై.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆదాయం పెంపుపై పరిశోధనలు

ఆర్ఎఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు



ప్రజాశక్తి- అనకాపల్లి

ఉత్తరాంధ్ర జిల్లాలైన ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రైతులకు అధిక దిగుబడులను ఇచ్చే ఉత్తమమైన, ఈ ప్రాంతానికి అనువైన చెరకు వంగడాలను ఎప్పటికప్పుడు అందించడంలో అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి ఒక విశిష్ట స్థానం ఉంది. అయితే రానురానూ చెరకు పంట దిగుబడులు తగ్గడం, ఉత్పత్తి వ్యయం పెరగడంతో చెరకు వేసేందుకు రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. ఈ నేపథ్యంలో రైతులకు ఎటువంటి పంటలను వేయడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చనే అంశాలపై పరిశోధనలు జరుపుతున్నారు. దీనిపై ఆర్ఎఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సిహెచ్ ముకుందరావు ప్రజాశక్తికి తెలియజేసిన వివరాలు ఆయన మాటల్లోనే...

ఆర్ఎఆర్ఎస్‌లో ఇంతవరకు ఎన్ని చెరకు వంగడాలు విడుదల చేశారు ?

1913లో స్థాపించిన వ్యవసాయ పరిశోధనా స్థానం సుమారు 21 నూతన



చెరకు వంగడాలను అభివృద్ధి పరిచింది. ఇటీవల ఎర్ర కుళ్లు తెగుళ్లను పూర్తిగానూ, కాటుక తెగుళ్లను కొంతవరకు తట్టుకొని హెక్టారుకు 130 టన్నుల దిగుబడిని ఇచ్చే నీటిపారుదల ప్రాంతానికి అనువైన అరుంధతి రకాన్ని కేంద్ర ప్రభుత్వ పంట రకాల విడుదల కమిటీ విడుదల చేసింది.

కొత్త రకాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయా?

అరుంధతి రకంతో పాటు 2006 ఎ 223, 2010 ఎ 229 రకాలు విడుదలకు సిద్ధంగా

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తీగ లాగినా కదలని డొంక!

ఈ కారణంగానే ఏళ్లుగా జాప్యం జరుగుతుందన్న ఆవేదనను సదరు అధికారి అప్పట్లో వెల్లడించారన్నది వాస్తవం. దీని పర్యవసానంగా 2005లో పీఠాధిపతుల కేసు నమోదైంది. దేవాలయ భూములు అన్యాక్రాంతం అయిపోతున్నాయని దేవాలయానికి రెగ్యులరైజేషన్ పాలసీ ఉందని, వీటిని వేలం వేసి అమ్ముకోవాలి తప్ప ఎవ్వరికీ రెగ్యులరైజ్ చేయడానికి వీల్లేదంటూ వీరంతా డిమాండ్ చేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టు ఈ భూములపై స్టే ఇస్తూ వేలం వేసి అమ్ముకోవాలని రెగ్యులరైజ్ చేయడానికి వీల్లేదని రాష్ట్ర వ్యాప్తంగా సిఫారసు చేసింది. ఇదిలా ఉండగా ఈ నేపథ్యంలో 2009లో వేలం వేసేందుకు దేవస్థానం అధికారులు చొరవ చేయగా 1903 గిల్‌మెన్ రికార్డుల్లో దేవస్థానం పేర్లే కాదని, ప్రజలు, రైతుల పేర్లూ ఉన్నాయని సాధ్యపడదని తేల్చేయడం విశేషం.

అసలు ఎంత భూమి ఉంది? ఎవరిదెంత?

1903 గిల్‌మెన్ రికార్డు ప్రకారం 5 గ్రామాలకు కలుపుకొని 11282 ఎకరాలుంది. గిల్‌మెన్ రికార్డు పరిశీలిస్తే దేవాలయానికి కేవలం 39.5 ఎకరాలు మాత్రమే ఉంది. 2008లో సర్వే చేసినప్పుడు 420 ఎకరాల భూముల్లో 12,149 ఇళ్లు ఉన్నాయని ఇవి దేవస్థానం వదిలేయాల్సి వస్తే ప్రత్యామ్నాయంగా 610 ఎకరాలు దేవస్థానానికి ఇవ్వాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. ఒకవేళ రెగ్యులరైజేషన్ జరిగితే ఈ సొమ్మంతా దేవస్థానానికే ఇవ్వాలన్న నిబంధన పెట్టారు.

పంచగ్రామాల ప్రజల డిమాండ్ ఏమిటి?

1903 సర్వే సెటిల్‌మెంట్ (గిల్‌మెన్) రికార్డుల ఆధారంగా ఈ భూమిని సెటిల్ చేయాలన్న వాదన వినిపిస్తోంది. లేదంటే 1996–97లో స్థానిక తహశీల్దార్ దేవస్థానానికి కట్టబెట్టిన రైత్వారీ పట్టాలను సవరించాలని పంచగ్రామాల ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి కృష్ణంరాజు 'కూటమి' ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఈ పట్టాల జారీపై సవరణ జరిగితేనే సరైన రీతిలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. లేదంటే ఇళ్ల లబ్ధిదారులకు మాత్రమే న్యాయం జరిగి ఇంతవరకూ ఈ ప్రాంతాల్లో స్థలాలు కొనుక్కున్న రైతులు, ఇతరులు నష్టపోతారని తెలిపారు. ఆ తర్వాత క్రయ విక్రయాలకు అనుమతులివ్వాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఆర్థోవైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సు

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఇప్పటివరకు డాక్టర్ సునంద్ కుమార్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షునిగా వ్యవహరించారు. వచ్చే ఏడాది ఈ రాష్ట్ర స్థాయి సదస్సు కర్నూలులో నిర్వహిచాలని నిర్ణయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్ఎస్.లోకనాథ్, డాక్టర్ వర్మ, ప్రముఖ ఆర్థో వైద్యులు వివికె, రమేష్ సేన్, విజయ్, అశోక్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆదాయం పెంపుపై పరిశోధనలు

ఉన్నాయి. ఇవి కొంతవరకు పసుపు ఆకు తెగులు తట్టుకుంటాయి. 2010 ఎ 229 రకాన్ని జాతీయ స్థాయిలో ఇక్కడి శాస్త్రవేత్తల బృందం జర్మ్‌ప్లాస్మ్ రిజిస్ట్రేషన్ చేయడంతో ఇక్కడి రకాలకు మంచి గుర్తింపు వచ్చింది.

రైతాంగానికి మీరు అందిస్తున్న ఇతర సేవలు ఏమిటి?

ఉత్తర కోస్తా మండలి రైతాంగానికి గ్రామీణ కృషి మౌసం సేవ పథకం ద్వారా ఎప్పటికప్పుడు వ్యవసాయ వాతావరణ ఆధారిత సలహాలు ఇవ్వడం, చీడపీడల యాజమాన్యంపై విస్తృత పరిశోధనలు జరిపి సమగ్ర సస్యరక్షణ పద్ధతులు తెలియజేస్తున్నాం.

సుస్థిర సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?

చెరకు, వరి, మొక్కజొన్న, అపరాలు పంటల్లో సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ విధానాలపై పరిశోధనలు చేసి రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా బలవర్ధకమైన సేంద్రీయ ఎరువుల తయారీ విధానాలపై రైతులకు వివరిస్తున్నాం. ఇందుకోసం పరిశోధన కేంద్రంలో పొడి ద్రవరూప జీవన ఎరువులను తయారుచేసి రైతులకు తక్కువ ధరకు అందిస్తున్నాం.

పంటకోత అనంతర సాంకేతిక పరిజ్ఞానంపై జరిగే పరిశోధనలు ఏమిటి?

హైడ్రోస్ వినియోగించకుండా సేంద్రీయ పద్ధతుల ద్వారా బెల్లం తయారీ విధానం, దేశంలోనే అత్యుత్తమంగా భావించే ఉప్పుడు బియ్యం ప్రాసెసింగ్, బెల్లం పొడి, బెల్లం పూతరేకులు యంత్రం, బెల్లం పొడి తయారీలో నాలుగు పేటెంట్లు సాధించాం. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ స్కీమ్ ద్వారా ఇంక్యుబేషన్ సెంటర్ స్థాపించి బెల్లం తయారీకి, చిరుధాన్యాల ప్రాసెసింగ్‌కు, పనస ప్రాసెసింగ్‌కు ఉపయోగపడే యంత్రాలు అందుబాటులోకి తెస్తున్నాం.

జివిఎంసిలో టిడిఆర్‌ల పేరుతో భారీ కుంభకోణం



మీడియాతో మాట్లాడుతున్న మూర్తియాదవ్

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో టిడిఆర్‌ల పేరుతో భారీ కుంభకోణం జరుగుతోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. మేఘాలయ హోటల్లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి హయాంలో రూ.వందల కోట్లు అక్రమ టిడిఆర్‌లు పొందిన వారు, ఇప్పుడు వాటిని దక్కించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కూటమి నేతలకు ప్రలోభాలు పెట్టి, జివిఎంసి అధికారుల పై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. అప్పటి టిడిఆర్‌ల కుంభకోణాన్ని కూటమి నేతలకు అంటగట్టడానికి కొంతమంది వైసిపి అనుకూల అధికారులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. డి-పట్టా, దేవస్థానం భూములకు వైసిపి హయాంలో అక్రమంగా ఎన్నో టిడిఆర్‌లు ఇచ్చారని తెలిపారు. టిడిఆర్‌లపై కూటమి ప్రభుత్వం వేసిన విజిలెన్స్ విచారణ జరుగుతున్నా, వైసిపి టిడిఆర్‌ల మాఫియా ఎక్కడా తగ్గడం లేదన్నారు. పెండింగ్‌లో పెట్టిన టిడిఆర్‌లు విడుదల చేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కొత్త టిడిఆర్‌లు ఇవ్వాలని జివిఎంసి అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారన్నారు. అక్రమ టిడిఆర్‌లను రద్దు చెయ్యాలని, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే చేయకపోతే జివిఎంసి రూ.వందల కోట్ల ఆదాయాన్ని కోల్పోతుందని, కూటమి ప్రభుత్వం అప్రమత్తం కావాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడలతో మానసిక పరిణితి : ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గెలుపు, ఓటములను ఒకేలా తీసుకునే పరిణితిని క్రీడలు అందిస్తాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న 18వ ఆలిండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ, క్రీడల్లో పాల్గొనడమే విజయంతో సమానమన్నారు. పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయకుండా క్రీడలు, ఉన్నత విలువలు నేర్పించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఒలింపిక్స్, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించడం ద్వారా అనేక చిన్న దేశాలు ప్రపంచ వ్యాప్తంగా ఉనికి చాటుకుంటున్నాయని, క్రీడలకు అంతటి శక్తి ఉందని వివరించారు. గతంతో పోల్చుకుంటే క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ప్రకటించే అవార్డులు, రివార్డుల స్థాయి గణనీయంగా పెరిగిందన్నారు. మాజీ డీజీపీ నండూరి సాంబశివరావు, జీఎస్టీ కమిషనర్ ఎంఎన్.నాయక్, డాక్టర్ శాంతారావు, ఊర్మిళ గజపతిరాజు, డాక్టర్ లక్ష్మణరావు, సతీష్, పిఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఘనంగా వాసుపల్లి పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలను ఆశీలుమెట్ట వద్ద ఉన్న కార్యాలయంలో, డిఫెన్స్ అకాడమీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య 61 కిలోల కేక్‌ను గణేష్ కుమార్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో కార్యకర్తలతో పాటు గణేష్‌కుమార్ కూడా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్ మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ నిధులు అప్పులు తీర్చడానికి కూడా సరిపోవని, ఆ మాత్రం దానికి ఏపీలో కూటమి నాయకులు సమస్య తీరిపోయినట్లు భజనలు చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగినా చంద్రబాబు, పవన్ కల్యాణ్ భజన బృందం అద్భుతంగా ఉన్నట్లు ప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జాన్ వెస్లీ, దక్షిణ నియోజకవర్గం వైసిపి నాయకులు డాక్టర్ మూగి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్, కార్పొరేటర్లు చెన్నా జానకిరామ్, తోట పద్మావతి, దొడ్డి రామానంద్, దొడ్డి కిరణ్, కొణతాల కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉన్నత విద్యతో యువతకు అపారమైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ సొంతంగా ఎదిగేందుకు కృషి చేయాలని దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. దొండపర్తి జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఎయిమ్ సాఫ్ట్ వేర్ టెక్నాలజీ సంస్థను ఆదివారం ఎపి ఎంఎస్ఎంఇ చైర్మన్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌తో కలిసి వంశీకష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ సంస్థ గాజువాకలో ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగిందని, అక్కడ సుమారు 500 మంది వరకు అనేక కోర్సులలో శిక్షణ తీసుకొని ఉపాధి పొందుతున్నట్లు చెప్పారు. దొండపర్తి ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ నూతన సంస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు కోరుకున్న కోర్సుల్లో యువత శిక్షణ పొందవచ్చని తెలిపారు.

జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, యువతకు చదువుకోవాలనే తపన ఉంటే విశాఖలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. సంస్థ ఎమ్‌డి ఎస్.శేషగిరి, డైరెక్టర్ మహాలక్ష్మి మాట్లాడుతూ, తమ సంస్థల్లో నిపుణులతో ఆయా కోర్సులకు సంబంధించిన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మి, సీనియర్ నేత నారా నాగేశ్వరరావు, చంటి, నరేంద్ర, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఫిల్మ్ ఫెస్టివల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన ఈ నెల 5 నుంచి మూడు రోజులపాటు పౌర గ్రంథాలయంలో తెలుగు సినిమా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. తొలి పూర్తి నిడివి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' 1932 ఫిబ్రవరి 6న హెచ్ఎం.రెడ్డి దర్శకత్వంలో విడుదలైన సందర్భంగా తెలుగు సినిమా దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 5, 6, 7 తేదీలలో తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతి రోజూ సాయంత్రం 5:30 గంటలకు ప్రారంభం మయ్యే ఈ ఫెస్టివల్‌లో 5వ తేదీన రైతు బిడ్డ, 6వ తేదీన ఒక ఊరి కథ, 7వ తేదీన నా ఆటో గ్రాఫ్ సినిమాలను ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రవేశం ఉచితం అని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పీకర్ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు రాజ్యాంగంలోని 1/70 చట్టం ఆటంకంగా ఉందని, దాన్ని సవరించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొనడం రాజ్యాంగ విరుద్ధమని, ఈ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగం ఐదవ షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీలో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టకూడదని, వ్యాపారాలు నిర్వహించకూడదని, ప్రభుత్వం కూడా గ్రామ సభల అనుమతి తీసుకొనే కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో పలు చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. స్పీకర్ వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వం తన వైఖరి తెలియజేయాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ చక్రవర్తికి అభినందనలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మధురవాడ పరదేశిపాలెం డాక్టర్ సదాశివరావు లే-అవుట్‌కు అప్రూవల్ ప్లాన్ మంజూరుకు విశేష కృషి చేసిన విల్లూరి డాక్టర్ చక్రవర్తి, తిరుమల దేవి దంపతులను అసోసియేషన్ సభ్యులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ శర్మ, పి.గుప్తా మాట్లాడుతూ, తాము లే-అవుట్ అనుమతి కోసం అనేక ప్రయత్నాలు చేసినా పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ పరిస్థితులలో సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి విల్లూరి చక్రవర్తి తీసుకెళ్లడంతో, సిఎం పేషీ ఓఎస్‌డి ద్వారా విశాఖ కలెక్టర్‌కు నివేదిక రావడంతో వెంటనే పరిష్కరించారని తెలిపారు. విల్లూరి దంపతుల కషిని కొనియాడారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



భీమిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీ తరగతి గదిలో చదువుతున్న విద్యార్థినులు

- డిసెంబర్ నాటికే ఇంటర్ సిలబస్ పూర్తి
- ప్రస్తుతం 'సంకల్ప్ -25' పేరిట సందేహాల నివృత్తి
- పరీక్షల సన్నద్ధతలో తలమునకలైన విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వచ్చేనెల ఒకటి నుంచి 20 వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికే సిలబస్‌లో పూర్తయి, రివిజన్ జరుగుతున్న నేపథ్యంలో ఉన్న కొద్దిరోజులైనా విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నిపుణులు అంటున్నారు.

ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి, సిఇసితోపాటు ఆరు వృత్తి విద్యా కోర్సులు ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు, ఇటి, ఎటి, ఒఎఎస్, సిఎస్ఓ ఉంటాయి.వృత్తివిద్యా కోర్సుల్లో థియరీతోపాటు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి.ఈ నేపథ్యంలో సబ్జెక్టుల వారీగా మంచి మార్కులు సాధన, ఉత్తమ ఫలితాలకు ఏయే సబ్జెక్టుల్లోని ఏయే పాఠ్యాంశాలు, అధ్యాయాలపై దృష్టి పెట్టాలో సంబంధిత విషయ నిపుణులు సూచనలు చేశారు.

వృక్ష శాస్త్రంలో...



ఇంటర్ ద్వితీయ ఏడాదిలో బోటనీలో రెండు మార్కుల ప్రశ్నలకు సంబంధించి.. మొక్కలలో రవాణా, కిరణ జన్య సంయోగ క్రియ, అణు స్థాయి ఆధారిత అనువం శికత, మానవ సంక్షేమంలో సూక్ష్మ జీవులు అధ్యాయాలు చదివితే సులభంగా మార్కులు సంపాదించవచ్చు. నాలుగు మార్కుల ప్రశ్నలకు చదవాల్సిన అధ్యాయాలు... ఎంజైములు, మొక్కల పెరుగుదల అభివృద్ధి, అణుస్థాయి ఆధారిత అనువంశికత, జీవ సాంకేతిక శాస్త్రం, దాని అనువర్తనాలు. 8 మార్కుల ప్రశ్నలకు మొక్కలలో శ్వాసక్రియ, జీవ సాంకేతికశాస్త్రం సూత్రాలు, ప్రక్రియ అనే అధ్యాయాలు చదివితే ఉత్తీర్ణత, మంచి మార్కులు సాధించడం చాలా సులభం.

పి.దుర్గాప్రసాద్, అధ్యాపకులు, వృక్షశాస్త్రం

భౌతిక శాస్త్రంలో..



ఇంటర్ సెకెండియర్ ఫిజిక్స్‌లో 1,6, 14 పాఠాల్లో 2 పాఠాల నుంచి 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. 2, 3, 5, 9, 13 ,14 పాఠాల్లో ఏవైనావి నాలుగు పాఠాల నుంచి 4మార్కుల ప్రశ్నలు, 8, 10, 11, 12, 16 పాఠాల నుంచి రెండు మార్కుల ప్రశ్నలు వస్తాయి. చక్కగా ప్రిపేర్ అయితే సులభంగా 30 నుంచి 40 మార్కులు సంపాదించవచ్చు. 60 కి 60 మార్కులు సాధించాలంటే.. 1,6,14 పాఠాల్లో ఏవైనా 2 పాఠాల నుంచి 8 మార్కుల ప్రశ్నలు, లెక్కలు, 2,3, 4, 5, 7, 9, 13, 15 పాఠాల్లో ఏవైనా 6 పాఠాల్లో 4 మార్కుల ప్రశ్నలు, లెక్కలు, 2, 7,8, 10,11,12,15, 16 పాఠాల్లో 2 మార్కుల ప్రశ్నలు, లెక్కలు ప్రిపేర్ అయితే 60 కి 60 మార్కులు వస్తాయి.

బి.సింహాద్రప్పడు,
భౌతికశాస్త్ర అధ్యాపకులు

శతశాతం ఫలితాలు లక్ష్యంగా..



ఇంటర్‌లో శతశాతం ఫలితాలు లక్ష్యంగా సమిష్టిగా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాం. ఈఏడాది మా కళాశాలలో ఫస్టియర్‌లో 322 మంది, సెకెండియర్‌లో 304 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు 'సంకల్ప్ 2025' పేరిట డిసెంబర్ నుంచి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు యధావిధిగా తరగతులు నిర్వహిస్తూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్జెక్టులలో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ఫస్టియర్ విద్యార్థులకు 1, 3 తేదీల్లో 100 మార్కులకు నైతికత, మానవీయ విలువలు, పర్యావరణవిద్య పరీక్షలను బ్రీఫ్‌గా రాయాలి. 100 మార్కుల్లో 35 మార్కులు వస్తే సరిపోతుంది. గతేడాది ఇంటర్‌లో 74 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

పి.రామ్‌ప్రసాద్, ప్రిన్సిపాల్,
ప్రభుత్వ జూనియర్ కళాశాల , భీమునిపట్నం

జంతు శాస్త్రంలో...



జువాలజీలో ఇలా చదివితే ఉత్తీర్ణత సులభంగా సాధించవచ్చు. యూనిట్ 7లో జీవ పరిణామం, మానవ శరీర అంతర్నిర్మాణ శాస్త్రం, శరీర ధర్మ శాస్త్రం 1, 7 యూనిట్లు చదివితే సంబంధిత ప్రశ్నలకు సమాధానాలు సులభంగా రాయొచ్చు. యూనిట్ 5 లో మానవ, పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ, స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థల్లో వచ్చే ప్రశ్న కు సులభంగా సమాధానాలు రాయొచ్చు.

ఎస్.అప్పన్నబాబు,
జంతు శాస్త్ర అధ్యాపకులు

రసాయన శాస్త్రంలో..



రసాయన శాస్త్రంలో పి బ్లాక్ మూలకాలు, విద్యుత్, రసాయనశాస్త్రం, రసాయన గతికశాస్త్రం పాఠ్యాంశాల నుంచి8 మార్కుల ప్రశ్నలు రెండు వచ్చే అవకాశం ఉంది. ఘనస్థితి, ద్రావణాలు, ఉపరితల రసాయనశాస్త్రం, జీవాణువుల పాఠ్యాంశం నుంచి 4 మార్కుల ప్రశ్నలు 4 వచ్చే అవకాశం ఉంది. పాలిమర్‌లు, నిత్య జీవితంలో రసాయన శాస్త్రం, పి బ్లాక్ మూలకాల పాఠ్యాంశాల నుంచి రెండు మార్కుల ప్రశ్నలు ఆరు వచ్చే అవకాశం ఉంది.ఈ పాఠ్యాంశాల నుంచి నాలుగు మార్కుల వరకు విద్యార్థి స్కోర్ చేయవచ్చు.

బి.మాధవరావు,
రసాయన శాస్త్ర అధ్యాపకులు

కష్టజీవులకు ఒరిగిందేమీ లేదు

ప్రజాశక్తి-తగరపువలస : కేంద్రబడ్జెట్‌లో కష్ట జీవులకు ఒరిగిందేమీ లేదని సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరి రాంబాబు విమర్శించారు. ఆదివారం స్థానిక జిఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీలను పక్కన పెట్టేశారన్నారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటి, ఐఐటి, ఐఐఎం, వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రస్తావనే లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గతేడాది కంటే కేటాయింపులు తగ్గాయన్నారు. సమావేశంలో పార్టీ సహాయ కార్యదర్శి మొర అప్పలరాజు, సభ్యులు ఎన్ ఆదినారాయణ పాల్గొన్నారు

చిత్తడి నేలల ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి - విశాఖపట్నం : విశాఖ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. చిత్తడి నేలల ప్రాముఖ్యతను పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దేశంలో 85 రకాల చిత్తడి నేలలు ఉన్నాయని, వాటిపై అవగాహన కల్పించారు. కాలేజీ ప్రిన్సిపల్ ఆర్.మంజుల అధ్యక్షత వహించిన కార్యక్రమంలో బోటనీ విభాగాధిపతి టిఎంఎ.నివేదిత, బయోడైవర్సిటీ సంరక్షణకు చిత్తడినేలలు ఎంతగానో సహకరిస్తాయన్నారు. కార్యక్రమంలో బోటనీ లెక్చరర్లు డాక్టర్ జె.లావణ్య, ఐఅండ్‌సి కోఆర్డినేటర్ ఎస్.అనూష, డాక్టర్ లలిత శరణ్య, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సుతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ మురళీకృష్ణ

ప్రజాశక్తి తగరపువలస : పాలిటెక్నిక్ కోర్సు చదవడం ద్వారా తొందరగా ఉద్యోగం పొందవచ్చని భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో "ప్రగ్యాన్ 2కె25 పేరిట ఆదివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఉన్నట్లు వివరించారు. పైడి భీమవరం,ఎపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ హెడ్ అండ్ అడ్మిన్ కె కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఫార్మసీ రంగంలో మెండుగా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జీవితంలో స్థిరపడేందుకు విద్యార్థి దశలోనే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

పాలిసెట్ నమూనా పరీక్ష..

కళాశాలలో పాలిసెట్ నమూనా పరీక్షను నిర్వహించారు. విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ 10 వేలు, రెండో బహుమతిగా రూ 7 వేలు, మూడో బహుమతి గా రూ 3,500లతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. సాంకేతిక ఉత్సవంలో ఓపెన్ హౌస్, పాలిటెక్నిక్ విద్యార్థులు తయారు చేసిన 50 సాంకేతిక నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అవంతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జగదీష్, శేషు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలో శొంఠ్యాం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి. అనకాపల్లి గాంధీనగర్‌కు చెందిన బయ్యవరపు. నూతన్ కుమార్(23) మధురవాడలో లివింగ్‌స్టోన్ షోరూంలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అనకాపల్లి నుండి మధురవాడ బైక్‌పై వస్తుండగా శొంఠ్యాం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డాడు. అవివాహితుడైన మృతునికి తల్లిదండ్రులు లోకేశ్వరి, శంకరరావు, సోదరి దీప్తి ఉన్నారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చేనెల 8 వరకు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జివిఎంసి ప్రధాన కార్యాలయంతోపాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రతిసోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. వచ్చేనెల 8న ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత యథావిధిగా కొనసాగుతుందని, ప్రజలు, అధికారులు గమనించాలని కోరారు.

అలాగే నగర పోలీస్ కమిషనరేట్‌తోపాటు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ వచ్చేనెల8న ఎన్నికల కోడ్ ముగిసేవరకు పిజిఆర్ఎస్ ఫిర్యాదు స్వీకరణ ఉండదని సిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

1452వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిసామర్థ్యంతో నడిపేందుకు కేంద్రం ఇచ్చిన ప్యాకేజీని వినియోగించాలని స్టీల్ ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద రిలేదీక్షలు ఆదివారం 1452వ రోజున ఇంటక్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్ విలీనం చేయాలని,టాక్స్ హాలిడే ప్రకటించాలని కోరారు. వేతనాలను చెల్లించి కార్మికులను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- సీతమ్మధార : సాహితీవేత్త, ఆకాశవాణి సీనియర్ అనౌన్సర్ బండి సత్యనారాయణ ఉద్యోగవిరమణ సందర్భంగా ఆయన సాహిత్యంపై ప్రముఖ రచయితలు రాసిన రాస సంకలన 'ఇష్టపది. బహుజన బాంధవులు' పుస్తకాన్ని ఆదివారం పౌర గ్రంథాలయంలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షతన జరిగిన సభలో పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ఆవిష్కరించారు . ఈ పుస్తకాన్ని సావిత్రిబాయిపూలే ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మికి అంకితమిచ్చారు. కార్యక్రమంలో రాధ, కుసుమ, సి సుబ్బారావు, కె.ఇందిర పాల్గొన్నారు.

కాపులకు భరోసా కల్పించడమే లక్ష్యం

ప్రజాశక్తి- సీతమ్మధార: పరస్పర సహకారం, సమైక్యతతో కాపుల అభివృద్ధికి కృషి చేయాలని, కాపులకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో కాపు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకులు కర్రి వెంకటరమణ అన్నారు. ఆదివారం అక్కయ్యపాలెం బస్‌స్టాప్ సమీపంలో వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద కాపు సంక్షేమ భరోసా కేంద్రాల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, కాపులలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా వారికి వెంటనే సాయం అందించాలనే సంకల్పంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందరు భాగస్వాములై సహకరించాలని కోరారు. రాంబిల్లి మండలం వెంకటాపురం జంక్షన్ వద్ద ప్రధాన కార్యాలయం ఉందన్నారు. ముందుగా కాపు సంక్షేమ భరోసా కేంద్రాల బ్రోచర్ ఆవిష్కరించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ మహిళా కన్వీనర్‌గా కొనదం అమ్మమణి, తూర్పుకన్వీనర్‌గా నందికోళ్ల సుబ్బయ్య, ఉత్తర కన్వీనర్‌గా గొర్లె మూలకోటి, 90వ వార్డు కన్వీనర్‌గా బారుకుల జగ్గారావు 91వవార్డు కన్వీనర్‌గా తోట రామాంజనేయులు, గోపాలపట్నం ఏరియా కన్వీనర్‌గా వెలిరెడ్డి శ్రీనివాసరావును నియమించారు.

కడుపుబ్బ నవ్వించిన 'వినోదాల విందు'



స్కిట్ ప్రదర్శిస్తున్న ఎంవి.సుబ్రహ్మణ్యం, అడవిరాజు తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ 'వినోదాల విందు'లో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. సంస్థ అధ్యక్షులు ఎంవి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో హరిహర నృత్యనికేతన్ డాన్స్ స్కూల్ గురువు అల్లు వెంకటరమణ శిష్యులు అనూష, అనన్య, సాంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. అనంతరం వడ్డాణం, సెల్‌ఫోన్, నూడిల్స్, పెదవి చిట్లింది. తాగుబోతు, కోర్టు సీన్, దొంగకు దొండే డాక్టర్ పేషెంట్, లవర్ మీద కేసు, ప్రూఫ్, 4సిమ్స్, రివర్స్ పంచ్, మ్యూజిక్ డైరెక్టర్, డైమండ్ నెక్లెస్, ముందుజాగ్రత్త, అబ్బాయికి మాటలొచ్చాయి, 108 వంటి లఘునాటికలు, స్కిట్స్ అలరించాయి. జబర్దస్త్ ప్రకాష్, ఎంవి సుబ్రహ్మణ్యం. వెంకటేశ్వరరావు, పోర్ట్ శేషు, భానుప్రకాష్, శివ జ్యోతి,. పుష్పమి. ఈశ్వరరావు, సీత తమ నటనతో నవ్వులు పూయించారు. అనంతరం కళాకారులను తిలక్ పట్నాయక్, ఆడిటర్.సన్ మూర్తి, స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ మాల్యాద్రి మెమొంటోలతో సత్కరించారు.

ఘనంగా కళావేదిక వార్షికోత్సవం



క్రీడాకారులు, జర్నలిస్టులను సత్కరిస్తున్న కళావేదిక

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'కళావేదిక' 30వ వార్షికోత్సవాన్ని ఆదివారం విశాలాక్షినగర్ బివికె.కాలేజీ కళామందిరంలో .కళావేదిక గౌరవాధ్యక్షుడు కమల్ బైడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎయు పూర్వ ఉప కులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు, లెండి కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె.శివరామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా.కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నండూరి రామకృష్ణ మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించి,పలువురు కళాకారులకు అండగా నిలిచామన్నారు. వార్షికోత్సవంలో జర్నలిస్టులు జర్నలిస్టులు కెవి.శర్మ, చిన్నికృష్ణ, నాగరాజు పట్నాయక్, ఎల్లేశ్వర రావు, సిహెచ్‌విఎస్.రామకృష్ణ, జగన్మోహన్, పైలా దివాకర్, వెంపటి రాజు, వెంకట్, ఆర్.రాజేష్, ఎన్ రమేష్, 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులను, కోచ్‌లను సత్కరించారు. కళావేదిక సెక్రెటరీ డాక్టర్ బి.రజని వ్యాఖ్యాతగా వ్యవహరించగా, సంయుక్త కార్యదర్శి పిఆర్ఎస్ వెంకట ప్రభు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పలు శుభకార్యాలలో ఎమ్మెల్యే గంటా



కనుమ గ్రామంలో ఒక వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని పలు శుభకార్యాలలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. కనుమ గ్రామంలో చందవరపు కుమార్ కుమార్తె హాఫ్‌సారీ ఫంక్షన్‌లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి, శుభాకాంక్షలు అందజేశారు తర్లువాడ,పెద్దిపాలెం గ్రామాల్లో శుభకార్యాలలో పాల్గొన్నారు. నాయకులు బిఆర్‌బి నాయుడు, పోతిన గోవిందరావు, బంకు రాజు, మజ్జి రమేష్ నాయుడు పాల్గొన్నారు

స్నేహభావం, శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలి

పలుచోట్ల విసిసి జోనల్ కమిటీ మహాసభలు : నూతన కమిటీల ఎన్నిక



మల్కాపురం జోన్ విసిసి నూతన కమిటీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బాలల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత పెంపొందించవలసిన అవసరం ఎంతైనా ఉందని జెవివి నాయకులు చిలకా మూర్తి, విసిసి జగదాంబ జోన్ నాయకులు కె.మణి అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) జగదాంబ జోన్ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలో వారు మాట్లాడుతూ, ఈ ప్రపంచంలో పిల్లలు అత్యంత విలువైన వారని, నేటి బాలలే రేపటి పౌరులని చెప్పారు. అటువంటి పిల్లలు ఈ రోజు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పౌష్టికాహార లోపం, మత్తు, గంజాయి, మొబైల్‌కు బానిసకావడం, చదువు అయ్యాక ఉపాధి అవకాశాలు లేక నేర ప్రవృత్తి పెరుగుదల తదితరాలు చోటుచేసుకుంటు న్నాయని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు విసిసి ప్రయత్నిస్తుందన్నారు. మహాసభలో పంది మెట్ట ఆర్గనైజర్ మణి రిపోర్టు ప్రవేశ పెట్టారు. క్లబ్ స్థాయిలో బాలలకు నిర్వహించే కార్యక్రమాల ప్రణాళిక రూపొందించారు.

నూతన కమిటీ ఎన్నిక

విసిసి జగదాంబ జోన్ కమిటీని ఎన్నుకున్నారు కన్వీనర్‌గా సరోజినీదేవి, కో-కన్వీనర్‌గా ఎస్.సాయి జాహ్నవి పెద్దల నుంచి ఎంపిక కాగా, పిల్లల నుంచి ప్రెసిడెంట్‌గా అమిత్, సెక్రటరీగా సుజన, వైస్ ప్రెసిడెంట్‌గా ఐ.హసిని, జాయింట్ సెక్రటరీగా వి.లాస్య, కమిటీ సభ్యులుగా చందు, తరుణ్, ఎం.లిఖిత, భావ్యశ్రీ ఎన్నికయ్యారు. ఏరియా ఆర్గనైజర్లుగా కె.మణి, నందిని, సంధ్యనుఎన్నుకున్నారు.

ఎంవిపి కాలనీ : విసిసి మద్దిలపాలెం జోన్ మహాసభ శివాజీపార్కులో నిర్వహించారు. విసిసి జిల్లా కన్వీనర్ కె.సుశీల మాట్లాడారు. మహాసభలో డి.నీలవేణి రిపోర్టు ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి చంటి, ఎస్ఎఫ్ఐ నాయకులు కౌశిక్, ఐద్వా సభ్యులు కుమారి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. పెద్దల విభాగం నుంచి నూతన కమిటీ కన్వీనర్‌గా ఎ.మణి, కో-కన్వీనర్లుగా డి.నీలవేణి, జి.గీతాంజలి, పిల్లల విభాగం నుంచి ప్రెసిడెంట్ కె.శ్రావణి, కార్యదర్శిగా వి.జయప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా డి.శ్రీరాం, జాయింట్ సెక్రటరీగా బి.జస్వంత్ తదితరులు ఎన్నికయ్యారు.

తగరపువలస : పిల్లల మధ్య స్నేహభావం పెంపుదలకు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) నిరంతరం కృషి చేస్తున్నట్లు క్లబ్ జిల్లా జాయింట్ సెక్రటరీ డి శైలజ అన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం క్లబ్ భీమిలి జోన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకతను



భీమిలి జోన్ విసిసి నూతన కమిటీ

పెంచడం, సంస్కృతి, కళలు నేర్పించడం, క్రీడలను ప్రోత్సహించడం, ప్రకృతి పట్ల ఆసక్తి, పర్యావరణంపై అవగాహన పెంపొందించడం ద్వారా పిల్లలను చెడు వ్యసనాలకు దూరం చేయడం విసిసి లక్ష్యమన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం విసిసి భీమిలి జోన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కన్వీనర్‌గా తేజ, కో కన్వీనర్లుగా కె నాగరాణి, ఎస్ గుణమ్మ పెద్దల నుంచి ఎన్నికవ్వగా, శిరీష, పుష్ప, దుర్గ పిల్లల నుంచి ఎన్నికయ్యారు.పిల్లల నుంచి ప్రెసిడెంట్‌గా ఝాన్సీ, సెక్రటరీగా సౌమ్య, ఉపాధ్యక్షులుగా శశాంక్, జాయింట్ సెక్రటరీగా చాందినిఎన్నికయ్యారు.

ములగాడ : జివిఎంసి 62వ వార్డు త్రినాథపురం విసిసిజోన్ మహాసభ కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించారు. దేశభక్తి గీతాలాపనతో ప్రారంభమైన మహాసభలో మల్కాపురం జోన్ కన్వీనర్ ఇ.అరుణ నివేదిక ప్రవేశపెట్టారు మహాసభలో ప్రజానాట్యమండలి జోన్ కార్యదర్శి పి. లెనిన్‌బాబు డివైఎఫ్ఐ నాయకులు బి.ప్రసాద్, ఎ.ప్రశాంత్ యు.రాజు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం నూతన కమిటీలో జోన్ కన్వీనర్‌గా ఇ.అరుణ కో కన్వీనర్‌గా పి.పద్మ విసిసి కమిటీ అధ్యక్షులుగా వై కల్యాణి, కార్యదర్శిగా పి. నిఖిల, సభ్యులుగా చిన్మయి, చాతుర్య, సంజన, కోమలి, సంగీత, అహల్య, సిహెచ్ గాయత్రి, యు.వైష్ణవి జి.అశోక్, వై జగన్, యు భార్గవ్‌లను ఎన్నుకున్నారు.

గాజువాక : పెదగంట్యాడ సిడబ్ల్యూసిలో విసిసి స్టీల్‌జోన్ మహాసభ జరిగింది. ఈసందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, పిల్లల్లో శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పన, వేసవి శిబిరాలు నిర్వహణ, దేశభక్తి పెంపొందించడం, శ్రమ పట్ల గౌరవం, సమిష్టితత్వాన్నిపెంపొందించడం, సైన్స్, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించడం, ఇతరులకు సహాయ పడడం ప్రధాన లక్ష్యాలుగా విసిసి పనిచేస్తోందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం నూతన కమిటీ ఎన్నిక జర్గగా, పెద్దల నుంచి కన్వీనర్‌గా వై.సంధ్య, కో కన్వీనరుగా కె. ఎలమాజీ ఎంపిక కాగా, పిల్లల నుంచి ప్రెసిడెంట్‌గా వర్షిణి, సెక్రటరీగా గ్రీష్మ, వైస్ ప్రెసిడెంట్‌గా వై. ఎల్లాజీ, జాయింట్ సెక్రటరీగా కె..నేహ, మరో ఇద్దరిని సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో డి.వెంకటరావు, సిహెచ్ రాముడు, వెంకయ్య, ఐద్వా నాయకులు కామేశ్వరి, గుణ శంకర్, లక్కీ, యామిని పాల్గొన్నారు.



ఎంవిపి కాలనీ జోన్ విసిసి నూతన కమిటీ



జగదాంబ జోన్ విసిసి కమిటీ సమావేశం



గాజువాక విసిసి మహాసభలో పాల్గొన్న సతీష్‌రెడ్డి

పోర్టు ఆసుపత్రి టెండర్లకొస్తే తరిమికొడదాం

- ఆలిండియా వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



దీక్షల్లో మాట్లాడుతున్న నరేంద్రకుమార్

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రిలేదీక్షలు ఆదివారం 125వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఆలిండియా వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిడి నందకుమార్, టి.నరేందరరావు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని ఐక్య పోరాటాలు ద్వారా అడ్డుకుని, తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్యానికి సరైన కేటాయింపులు చేయని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, పోర్టు భూములను అడ్డికొప్పి, ఆస్తులను ప్రయివేటుపరంగా చేయాలని చూస్తోందని, అందులో భాగంగా ఆధునికీకరణ పేరుతో విశాఖ పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ అన్నారు. పోరాటాలతో టెండర్‌ను అడ్డుకున్న విధంగానే, పోర్టు ప్రయివేటు పరం కాకుండా ఉద్యమిద్దామని, దీనికి ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీలోని ఆరు ఫెడరేషన్లు పూర్తి మద్దతునిస్తున్నాయన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని పోర్టుల్లో కార్మికుల ఒక రోజు నిరసన తెలియజేస్తా మన్నారు. సి డి నందకుమార్ మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్‌ఫండ్స్, విలువైన వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రైవేటీకరణ నిర్ణయం అన్యాయమని, దీన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి కార్యదర్శి మసేన్ అధ్యక్షతన దీక్షల్లో ఐఎన్‌టియుసి, హెచ్ఎంఎస్, జాతీయ నాయకులు, సిఐటియు నాయకులు కె. సత్యనారాయణ, జె.సత్య నారా యణ, రామలింగేశ్వరరావు, శంకరరావు, కెవిఎస్ కుమార్, రాఘవులు, విజయకుమార్ నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన శతాబ్ది ఉత్సవాలు



పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలతో సత్కారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. 1924లో స్థాపించిన ఈ పాఠశాల, ప్రస్తుతం వందేళ్ళ పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వందేళ్ళ వేడుక నిర్వహించారు. ఆద్యంతం ఉత్సాహం, ఉద్విగ్న భరిత వాతావరణంలో జరిగిన వేడుకల్లో పూర్వ విద్యార్థులు పాఠశాలలోని తమ మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులందరికీ శతాబ్ది వేడుకలకు గుర్తుగా జ్ఞాపికలు అందజేశారు. సన్మానాలు చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆందోళన

ప్రజాశక్తి-కశింకోట

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ కశింకోట మండలం పల్లపు సోమవరం గ్రామంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆదివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 సంవత్సరం వరకు కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా ఎలక్ట్రీషియన్, ప్లంబర్, తాపీ మేస్త్రి తదితర బిల్డింగ్ వర్కర్లకు వివాహాలకు, ప్రమాదాలకు గురైన వారికి, డెలివరీలు వంటి సమయాల్లో సంక్షేమ బోర్డు ద్వారా ఆర్థిక సహాయం లభించేదని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో ఈ సంక్షేమ బోర్డును నిర్వీర్యమైందని, దీంతో బిల్డింగ్ వర్కర్స్ ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు చెప్పారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డ్‌ను మళ్లీ పునరుద్ధరించి బిల్డింగ్ వర్కర్స్‌కు పెండింగ్లో వున్న క్లెయిమ్స్‌ను క్లియర్ చేయాలని, పథకాన్ని కొనసాగించాలని కోరారు. 20సంవత్సరాల క్రితం ఉన్నా ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెరిగిన సిమెంటు, ఇనుము తదితర బిల్డింగ్ నిర్మాణానికి అవసరమైన వస్తువుల ధరలను తగ్గించి భవన నిర్మాణాలు సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 50ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు, కే.గోవింద, ఎన్.శ్రీను, ఎస్. నూకరాజు, సిహెచ్.శేషు, పి.అప్పలరాజు, బి.శేషు, కే.దుర్గాన్న, పి. పెద్ద నాగేశ్వరావు, పి.చిన్న నాగేశ్వరావు, ఇ.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలపాలి

ప్రజాశక్తి-మునగపాక : కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించి నిరసన తెలియజేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్రం రాష్ట్రానికి మరోసారి మొండి చేయి చూపించిందని మండిపడ్డారు. ప్రత్యేక హెూదా, వెనకబడ్డ ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీతో పాటు ఇతర విభజన హామీలను పక్కన పెట్టిందని తెలిపారు. మరోవైపు వైజాగ్ స్టీల్ ప్లాంటకు గత ఏడాది రూ.8622 కోట్లు బడ్జెట్లో కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్లో రూ.3295 కోట్లు కేటాయించిందని, గత ఏడాది కంటే బడ్జెట్లో రూ.5327 కోట్లు తగ్గించిందని పేర్కొన్నారు. ఆర్భాటంగా ప్రకటించిన రూ.11400 కోట్ల ప్యాకేజీ ప్రస్తావన లేవనెత్త లేదు సరి కదా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల గురించి మాట్లాడకపోవడం మోసం చేయడమే అవుతుందన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ముఖ్యమంత్రి స్పందించడంతో పాటుగా పార్టీల ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని విజ్ఞప్తి చేశారు.

ఎత్తిపోతల పథకం భవనం పరిశీలన

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం ఎల్బిపి అగ్రహారంలో అసంతృప్తిగా నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం భవనాన్ని, పైపులు వెళ్లే ప్రాంతాలను ఇరిగేషన్ ఈఈ త్రిమూర్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016లో ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.4.5 కోట్లు మంజూరు చేసిందని, టెండర్ దక్కించుకున్న గుత్తిదారులు సుమారు మూడు కోట్ల నిధులతో 90శాతం పనులు చేసి వదిలేశారని తెలిపారు. తొమ్మిదేళ్లు గడుస్తున్నా మిగతా 10 శాతం పనులు పూర్తికాక ఈ పథకం రైతులకు అందుబాటులో రాలేదని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కి పనులు పూర్తి చేసి నీరు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎ.అనుదీప్, మాజీ సర్పంచ్ తమరాన దాసు, ఎంపీటీసీ సభ్యుడు ఎల్లపు జగ్గారావు, మాజీ ఎంపీటీసీ తండా శ్రీను, సాయం శేషు, తమరాన శంకర్ పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం జిల్లా పరిషత్ హైస్కూల్ 1976-77 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అడ్డూరు డాక్టర్ నాగిరెడ్డి వెంకటరమణ తోటలో ఆదివారం అపురూప కలయికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల మధుర స్మృతులను, తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారి వారి పిల్లలు ఏం చేస్తున్నారని ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురువులను మనసారా స్మరించుకున్నారు. అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్‌వి.రమణ, ఎంజి.నారాయణ, బోకం పైడితల్లి, రొంగలి శంకర్రావు, గెడ్డం దుర్గారావు, ఎడ్ల లక్ష్మి, గొర్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో పబ్లిక్ గ్రీవెన్స్ తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే "పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ సిస్టం"ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రకటించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే, పున: ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఫిర్యాదుల కొరకు జిల్లా పోలీసు కార్యాలయానికి హాజరు కావద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

మర అడవులు జీవ వైవిధ్యానికి దోహదం

ప్రజాశక్తి-సబ్బవరం : అడవులు ముఖ్యంగా మర అడవులు ప్రకృతికి, జీవవైవిధ్యానికి ఎంతో దోహదపడతాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ వెట్ ల్యాండ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమకున్న పరిసరాలలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని, ఆరోగ్యావంతమైన సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి శంకర్, జువాలజీ లెక్చరర్ డాక్టర్ ఎం రత్న ప్రకాష్, జాతీయ సేవా సమితి ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -అనకాపల్లి : సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియట్ 2024- 25 పరీక్షలు ఈనెల 3 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షల్లో భాగంగా మూడో తేదీన ఇంగ్లీష్, 5న హిందీ, తెలుగు, ఉర్దూ, 7న రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం, 12న గణితము, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం, 15న తేదీన జీవశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నారాయుడు పాలెం గ్రామంలో అమ్మ సేవ సంస్థ అధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. భువనేశ్వరి కంటి ఆసుపత్రి వైద్యులు పాడి రైతులకు, గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి తక్కువ ధరలకు కళ్లద్దాలను అందజేశారు. అలాగే రక్తపోటు, మధుమేహం, అధిక బరువు గల వారికి పరీక్షల నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. అమ్మ సేవా సంస్థ వ్యవస్థాపకులు సబ్బి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎల్ నరసింహమూర్తి, పీ ప్రకాష్, కెఎస్ మిశ్రా, పాణిగ్రాహి నాగేశ్వర్, సురేష్, శ్రీనివాస్, లక్ష్మి, రవిబాబు, గ్రామ సర్పంచ్ కారుకుంది వెంకట రాజు, ఉప సర్పంచ్ మొళ్ళి నుకప్పారావు, గ్రామ పెద్దలు కొయ్య రమణ, చందనాటి శ్రీనివాస రావు, యలమంచిలి గోవింద, దాసరి గోపాలకృష్ణ, దాసరి సంతోష్, సబ్బి కృష్ణ, కొయ్య శ్రీను, కొల్లి నాగ, ఇళ్లపు గణేష్, డెయిరీ %జూం% కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేవాలయాలకు విరాళాలు

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక 'మంద బయలు' ప్రాంతంలోని గౌరీ పరమేశ్వరులు, శ్రీరాములవారి ఆలయాలకు గ్రామానికి చెందిన పెంటకోట విజయ్, అజయ్ సోదరులు శనివారం రాత్రి విరాళాలు అందజేశారు. గౌరీ పరమేశ్వరుల ఆలయానికి వివిధ ఖర్చుల నిమిత్తం శాశ్వత నిధి రూ.1 లక్ష 116లు, రానున్న శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా రాముల వారి కళ్యాణ నిమిత్తం రాముల వారి ఆలయానికి రూ.50 వేల 116లు ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా దేవాలయాల కమిటీల ప్రతినిధులు బొడ్డేడ ప్రసాద్, పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు, పెంటకోట శ్రీనివాసరావు, ఆడారి సూర్యచంద్ర రామారావు, ఆడారి గణపతి అచ్చం నాయుడు, పెంటకోట శివాజీ, పెంటకోట వెంకట్, గౌరీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వరి నాట్లుకు కూలీల కొరత

- దమ్ము చేసి సిద్ధంగా ఉన్న పొలాలు

- దిక్కుతోచని స్థితిలో రైతులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని వరి పంటకు చిరునామాగా గల వడ్డాది కస్పా పొలాలు కూలీల కొరతతో నాట్లు వేయకుండా మిగిలిపోయాయి. మోన పెడితే పంట చేతికి వస్తుందన్న గ్యారెంటీ గల ఈ పొలాల రైతులు ప్రస్తుతం కూలీల కోసం దిక్కులు చూస్తున్నారు. మండలంలోని వడ్డాది, బంగారుమెట్ట, చిన్నప్పన్నపాలెం, పోలేపల్లి, చోడవరం మండలం గౌరీపట్నం గ్రామాల మధ్య గల సుమారు 1600 ఎకరాల పంట భూమిని కస్పా పొలాలుగా పిలుస్తారు. పెద్దేరు నది ప్రవాహం, కాలువల వల్ల ఈ భూముల్లో ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో రెండు పంటలు పండుతాయి. దీంతో రైతులు కస్పాలో ఎకరం భూమి ఉంటే చాలు తిండి గింజలకు కొరత ఉండదు అన్న భావనతో పలువురు రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించి కస్పా పొలాల్లో భూములు కొనుగోలు చేస్తూ ఉంటారు. గత కొంతకాలంగా పరిస్థితులు మారిపోయాయి. సాగు ఖర్చు అధికంగా ఉండడంతో వరిసాగు పట్ల ఆసక్తి తగ్గించారు. 10 -20 ఎకరాలు ఉన్న రైతులు సైతం భూములను కౌలుకు ఇచ్చేవారు. కౌలుకు చేయడానికి సైతం అధిక సంఖ్యలో రైతులు ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం సాగు ఖర్చులు పెరిగిపోవడంతో ఖరీఫ్ సాగులో సైతం వరి నాట్లుకు ఇబ్బందులు తలెత్తాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరినట్లు వేయకపోవడంతో పొలాలు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుత రబీ సీజన్లో భాగంగా ప్రస్తుతం సుమారు 400 ఎకరాల వరకు రైతులకు పొలాలను దమ్ములు చేసి వరి నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతుండడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు దమ్ములు దున్నించి పొలం ఏం చేయాలో అర్థం కాలేదని వాపోతున్నారు.


దమ్ము చేసి నాట్లు వేయడానికి సిద్ధం చేసిన మడి

ఏమి చేయాలో అర్థం కావడం లేదు

నాకు చెందిన రెండు ఎకరాల్లో దమ్ముదునించాను. కూలీలు దొరకలేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- బొబ్బరి ఈశ్వరరావు, రైతు, వడ్డాది

బ్రాండిక్స్ కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం బ్రాండిక్స్ పరిశ్రమంలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. బ్రాండిక్స్ మహిళా కార్మికులకు వేతనాలు పెంచాలని ముద్రించిన కరపత్రాలను అచ్యుతాపురంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా మహిళా కార్మికులకు వేతనాలు పెంచాలని ఆందోళన నిర్వహిస్తున్నారని, వారికి సిఐటియు సంపూర్ణమైన మద్దతు తెలియజేసిందని తెలిపారు. కార్మికులకు మద్దతుగా వెళ్లిన సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సింది పోయి నిర్బంధాలకు పాల్పడితే కార్మికులు మరింత పట్టుదలతో పోరాటాలు కొనసాగిస్తారని హెచ్చరించారు. పరిశ్రమ యాజమాన్యం, ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్టించుకోవడం లేదన్నారు. జీతాలు పెంచాల్సిన యాజమాన్యాలు కార్మికులను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. టార్గెట్లు పేరుతో శ్రమను దోపిడీ చేస్తుందన్నారు. గార్మెంట్ పరిశ్రమల కార్మికుల జీతాలు జీవోలను 2015 నుండి సవరించకపోవడంతో బ్రాండిక్స్ మహిళా కార్మికులు తక్కువ జీతాలతో పనిచేయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కనీస వేతనాల జీవోను సవరించి కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల శివాజీ, చందక. రామకృష్ణ, ఎన్. బ్రహ్మాజీ, ఐద్వా నాయకులు సిహెచ్.మంగతాయారు, ఆర్. లక్ష్మి, మత్స్య కార్మిక సంఘం నాయకులు చేపల తాతయ్య పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు, రైతు సంఘం, ఐద్వా, మత్స్యకార్మిక సంఘాల నేతలు

వెంకన్న ఆలయం నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-వడ్డాది : జిల్లాలో ప్రసిద్ధి చెందిన వడ్డాది వెంకన్న ఆలయం నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఆదివారం వడ్డాదిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు, కార్యనిర్వాహణ అధికారి శర్మ ఆలయ అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. వారు రాజీనామా చేస్తే ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఎంతో మంది ముందుకు వస్తారని చెప్పారు. ఏడాది కాలంగా ఆలయ సిబ్బందికి వేతనాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటివరకు దేవాదాయ శాఖ నుండి ఆలయ అభివృద్ధికి ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని తెలిపారు. కల్యాణోత్సవాలను కూడా మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎంతోమంది దాతలు ముందుకొచ్చి దేవాలయ అభివృద్ధికి సహకరిస్తున్నా అధికారులు, చైర్మన్ వారిని ప్రోత్సహించలేదన్నారు. స్వామివారి 55 ఎకరాల భూమిపై వచ్చే శిస్తు, టికెట్లు, ఇతర ఆదాయ వనరులలో అవినీతి జరుగుతుందని ఆరోపించారు. దాతలు ఇచ్చిన వస్తు, నగదు కానుకలపై కూడా స్పష్టత లేదన్నారు. హుండీ ఆదాయం లెక్కించేటప్పుడు గ్రామ పెద్దలను, మీడియాను పిలవడం లేదని తెలిపారు. ఈ వ్యవహారాలపై విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుబిరెడ్డి వెంకట్రావు, వీర్ల సురేష్ పాల్గొన్నారు.

ఆలయ ఇఒ వివరణ

దీనిపై ఈవో టిఎన్ఎస్ శర్మను వివరణ కోరగా ఆలయ నిధులు దుర్వినియోగం అనేది అవాస్తవమన్నారు. ఎక్కడా అవినీతి జరగలేదని, ఎటువంటి విచారణకైనా తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

వాహనం ఢీకొని ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బంగారయ్యపేట తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డులో ఆదివారం అనకాపల్లి వైపు వెళుతున్న వాహనం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది ఒరిగిపోయింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. పెట్రోల్ బంకు దగ్గర కావడంతో నిత్యం వాహన రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. అయితే ఆ సమయంలో వాహనాలు ఏమీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

భక్తి శ్రద్ధలతో గాయత్రీ దేవి పూజ

ప్రజాశక్తి-కె.కోటపాడు : వసంత పంచమి సందర్భంగా స్థానిక రామాలయంలో ఆదివారం గాయత్రి మాత పూజ జరిగింది. పలు గ్రామాలకు చెందిన 78 మంది బాలబాలికలు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. బాల వికాస్ మండల సమితి కన్వీనర్ బండారు నారాయణ పాత్రుడు, గురువులు బండారు రామలక్ష్మి, జేగురుపాటి జోత్స్న, పైల ధరణి పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థ బలపడాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కుటుంబ వ్యవస్థ బలపడాలనే నినాదంతో మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన 30 కుటుంబాలు ఆదివారం పూడిమడక సముద్రతీరంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆటపాటలతో గడిపారు. పలువురు దంపతులు సాంస్కృత ప్రదర్శనలు చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఒకరి కష్టసుఖాల్లో మరొకరు భాగస్వాములు కావాలని, కష్టంలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందజేయాలని నిర్ణయించుకున్నారు. అనంతరం సముద్రతీరంలో స్నానాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో తనకాల అనంతరావు, రాపేటి విశ్వేశ్వరరావు, కాండ్రేగుల భాస్కరరావు, బొడ్డేటి శివ, కొణతాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో ఆదివారము వైసిపికి చెందిన నాయకులు జనసేన పార్టీలో చేరారు. వైకాపా పార్టీకి చెందిన వార్డు మెంబర్లు పైలా తాతబాబు, తమరాన నాయుడు, రెడ్డి నాయుడు, పైలా రమణ బాబు, అప్పారావు, శ్రీరాములు, ధర్మిరెడ్డి శ్రీనుతో పాటు 50 మంది జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే జనసేన పార్టీ కండువాలను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు పైలా రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారిని ఆదివారం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ దర్శనం చేసికొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27న జరగనుందని, జనవరి 29వ తేదీ నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, దానిని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమాలు అమలుకు రాజకీయ పార్టీలు సహకరించాలని, దీనికి కమిటీలను నియమించినట్లు తెలిపారు. అనకాపల్లి డివిజనల్ డెవలప్మెంట్ అధికారిని జిల్లా నోడల్ అధికారిగా నియమించడం జరిగిందన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులను డివిజన్ స్థాయి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు అధికారులుగా నియమించామని తెలిపారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలో పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు. 2024 డిసెంబర్ 30న వెలువరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం అనకాపల్లి జిల్లాలో 2802 మంది ఓటర్లు, 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, దానిలో భాగంగా వివిధ స్థాయి అధికారులతో కూడిన 27 ఎంసిసి బృందాలను నియమించామని చెప్పారు. మండలానికి ఒకటి చొప్పున 24 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఆర్డిఒ షేక్ ఆయిషా, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ వాసు, టిడిపి ప్రతినిధి బొలిశెట్టి శ్రీనివాసరావు, బిజెపి ప్రతినిధి వి రమేష్, బీఎస్పీ ప్రతినిధి జి చిన్నారావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మీసాల సుబ్బన్న, వైసిపి ప్రతినిధి టి షణ్ముఖ, ఆప్ ప్రతినిధి కె హరినాథ్ బాబు, సిపిఐఎం ప్రతినిధి బి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన డిఆర్ఓ

కల్లుగీత కార్మికులకు అన్యాయం

ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రా దేముడు



సమావేశంలో మాట్లాడుతున్న యర్రా దేముడు

ప్రజాశక్తి- కశింకోట

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు అన్యాయం చేసిందని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రా దేముడు విమర్శించారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం మండల అధ్యక్షులు కట్ట ఈశ్వరరావు అధ్యక్షతన కసింకోట గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో సాధించుకున్న హక్కులను తుంగలో తొక్కి నూతన మద్యం విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఎన్నికలకు ముందు కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయిస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని, గెలిచాక, యాత, శెట్టిబలిజ వంటి కులాలకు మద్యం షాపులు కేటాయించకుండా వ్యాపారులకు కేటాయించిందని పేర్కొన్నారు. బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5000 కోట్లు కేటాయించాలని, ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు నెల రోజుల్లో ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలు ఇవ్వాలని, పింఛన్ రూ.5 వేలకు పెంచాలని, కల్లుగీత కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించి గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని, రసాయనాలతో తయారైన బ్రాందీ విస్కీలతో పోల్చకుండా కల్లును చేతల శీతల పానీయంగా అభివృద్ధి చేయాలని, ప్రతి కార్మికునికీ ద్విచక్ర వాహనం ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ఈ సమావేశం సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా బత్తిన నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా యర్రా దేముడు, ఉపాధ్యక్షులుగా గండిబోయిన రాము, సహాయ కార్యదర్శిగా కట్టా ఈశ్వరరావు, కోశాధికారిగా నడిగట్ల సూకరాజు, జిల్లా కమిటీ సభ్యులుగా 22 మంది ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సుమారు పది మండలాల నుండి మేనేజింగ్ సొసైటీ పాలకవర్గం సభ్యులు సుమారు 160 మంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో కనీస వసతుల కరువు

ప్రజాశక్తి-యలమంచిలి

పట్టణంలోని పెట్రోలు బంకుల్లో కనీస వసతులు కరువయ్యాయని వినియోగదారులు వాపోతున్నారు. శుక్రవారం బైపాస్‌లోని ఇండియన్ ఆయిల్ బంకుల్లో పెట్రోలు కొట్టించుకొని, బైక్‌కు అవసరమైన గాలి కొట్టమని యలమంచిలికి చెందిన రమణబాబు అడిగితే అక్కడ పెట్రోలు కొట్టే బోయ్ గాలిపెట్టే మిషన్ రిపేరులో ఉందని జవాబు చెప్పాడు. నెల రోజుల నుండి ఇదే జవాబు చెబుతున్నారు. రిపేరు చేయించరా అని అడిగితే ఓనర్‌ను అడగండంటూ జారుకున్నాడు. యలమంచిలి పరిధిలోని మిగిలిన బంకుల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. మున్సిపాలిటీ పరిధిలో 5 పెట్రోలు బంకులున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోలు బంకులో కార్లు, జీపులు, నిలుపుకొండుకు స్థలం కేటాయించాలి. మరుగుదొడ్లు, తాగునీటి వసతి, వాహనాలకు ఉచిత గాలి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లే వాహన దారులు బంకుల వద్ద విశ్రాంతి తీసుకొనే సౌకర్యం కూడా కల్పించాలి. బంకుల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. ఈ వసతుల విషయంలో బంకుల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. వినియోగదారులు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. బంకులు కల్పించాల్సిన సౌకర్యాలపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టడం లేదు. కంపెనీ ఔట్‌లెట్ బంకులో తప్ప మిగిలిన బంకుల్లో గాలిపెట్టే మిషన్లు ఉన్నా అవి ఎప్పుడూ పనిచేయని స్థితిలో ఉంటాయి. ద్విచక్ర వాహనాలు నడిపే మహిళల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వారికి బంకుల్లో ప్రత్యేకంగా టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.



పనిచేయని గాలిపెట్టే యంత్రం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు దోచిపెట్టేదిగా ఉందని ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ బట్ల చిన్ని యాదవ్ విమర్శించారు. నిరుద్యోగం అధిక ధరలతో అల్లాడుతున్న సామాన్యులకు ఊరట కలిగించడానికి బదులు సంపన్నులకు మరిన్ని పన్ను రాయితీలు కల్పించాలని, ఉపాధి హామీ నిధులు ఎండగట్టారని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి విభజన హామీల అమలు, రైల్వే జోన్, సెంట్రల్ యూనివర్సిటీల, వైజాగ్ మెట్రో రైల్ అటకెక్కించిందని తెలిపారు. రైతులకు, పేద ప్రజలకు ఈ బడ్జెట్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిరుపయోగ బడ్జెట్ : ఆప్

కేంద్ర బడ్జెట్ సామాన్యుల పాలిట నిరుపయోగంగా మారిందని ఆప్ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విమానాశ్రయాలపై ఉన్న శ్రద్ధ రైతుల సంక్షేమం పాలిట లేకపోవడం దారుణమన్నారు.

అసంఘటితరంగాన్ని నిరుత్సాహపర్చింది

కేంద్ర బడ్జెట్ పేద వర్గాలను, అసంఘటిత రంగ కార్మికులను నిరుత్సాహపరిచిందని ఏఐటియూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ విమర్శించారు. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం అదుపు లేకపోవడంతో నిజ వేతనాలు అందుకు అనుగుణంగా పెరగలేదన్నారు.

సిఎన్ఆర్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిఎన్ఆర్ హాస్పిటల్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెదుళ్లనరవ పరిసర గ్రామాల ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, సీనియర్ నాయకులు ఇందల వెంకట రమణ, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, పిబివిఎస్ఎన్.రాజు, రాజాన పైడిరాజు, హాస్పటల్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని పాటిపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వసంత పంచమి వేడుకలు సందర్భంగా స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ కోయిలాడ నరసింహారావు ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థినులకు ఆదివారం ప్లాంక్స్, పెన్నులు, ఇతర విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో జి సత్య కుమారి, అంగులూరి రామకృష్ణ, రమణ, ఆళ్ల నాగేశ్వరరావు, ఎం మహేంద్ర, వై సంజీవరావు, గ్రంథాలయం, స్పందించే హృదయం చారిటబుల్ సంస్థ సభ్యులు, పాల్గొన్నారు.

ఘనంగా పసలమ్మ తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు సున్నం బట్టీలు గ్రామంలో శ్రీపసలమ్మ తల్లి అమ్మవారి 30వ తీర్థ మహోత్సవం పిఎసిఎస్ మాజీ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సీనియర్ వైసీపీ నాయకులు గండి రవికుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుండి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి నరసింగరావు, కూటమి నేతలు కర్రి కనకరాజు, ఇందల వెంకటరమణ, పిబివిఎస్ఎన్.రాజు(బుచ్చిరాజు)పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 3 ఫిబ్రవరి 2025

కరక కొండపై కన్ను

-రంగురాళ్ల వ్యాపారులతో కూటమి నేతల కుమ్మక్కు



కరక కొండపై తవ్వకాలు (ఫైల్ పొటొ)

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:పచ్చని కొండలను కొల్లగొట్టేందుకు కొందరు కూటమి నేతలు పన్నాగం పన్నుతున్నారని నియోజకవర్గంలో పలువురు విమర్శలు చేస్తున్నారు.కరకలోని రంగు రాళ్ళ కొండపై తవ్వకాలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

గొలుగొండ మండలంలోని కరక రంగురాళ్ల క్వారిని ఎలాగైనా లీజుకి అధికారికంగా కాజేయాలనే రంగురాళ్ల వ్యాపారుల ప్రయత్నంలో భాగంగా మూడు రోజుల క్రితం మైనింగ్, రంగురాళ్ల వ్యాపారస్తులు ఈ కొండపైకి చేరుకున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలియజేశారు. రంగు రాళ్ల కాజేయాలని ఈ ప్రయత్నాలు ఫాస్ట్ ఆఫీసర్ లక్ష్మీనరసి విషయం తెలుసుకొని కొండపైకి చేరుకుని ఆరా తీశారు. ఆత్యంత విలువైన రంగురాళ్లు లభ్యమయ్యే రంగురాళ్ల క్వారీని కొందరు ప్రజాప్రతినిధుల అండతో లీజు రూపంలో కొట్టేయాలని చూసిన ప్రయత్నం వెనుక వేల కోట్ల రూపాయల ప్లాన్ దాగి వుంది. అక్కడ దొరికే అత్యంత విలువైన రంగురాళ్లని కొనని రంగురాళ్ల వ్యాపారీ లేడు. నర్సీపట్నం ప్రధాన లాడ్జిల్లో ఈ రంగు రాళ్ల వ్యాపారస్తులు తిష్ట వేసి వ్యాపారాలు కొనసాగిస్తూ ఉంటారు. గతంలో ఈ రంగురాళ్ల వ్యాపారంతోనే గేదెలను కాసే రైతు నర్సీపట్నంలో కోటీశ్వరుడయ్యాడు. టీ షాపు నిర్వహించే ఛాయ్ వాలా సూపర్ మార్కెట్ ఓనర్ అయ్యాడు. ఇప్పుడు ఏకంగా అంతకుమించి ఆదాయం మళ్లీ అదే రంగు రాయి నుంచి వస్తుంటే ఎవరు మాత్రం వదిలేస్తారు. దానికోసమే రంగురాళ్ల వ్యాపారులతో కొందరు కూటమి నేతలు సిండికేట్ గా ఏర్పడి కరక రంగు రాళ్ల కొండ కొట్టేయడానికి పక్కాగా ప్లాన్ వేశారు.

గనులు భూగర్భ శాఖ ద్వారానే అధికారికంగా లీజు తీసుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే అఫిషియల్ గానే పావులు కదిపారు. దీంతో నిషేధిత అటవీ ప్రాంతంలోకి గనులు భూగర్భ శాఖ అధికారులు ప్రవేశించారని తెలిసింది. అధికారిక లేఖ లేకుండా ఏ విధంగా రిజర్వు ఫారెస్టులోకి అడుగు పెడతారని 144 సెక్షన్ కూడా అమల్లో ఉన్న ప్రాంతంలో సర్వేలు ఎలా చేస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. పక్కా ప్లాన్ ప్రకారమే మైనింగ్ అధికారులు కరక రంగురాళ్ల కార్వీలోకి అడుగుపెట్టినట్టు తెలిసింది.

దీనిపై అటవీ శాఖ అధికారి శామ్యూల్ స్పందిస్తూ ముందస్తు అనుమతి తీసుకోకుండా, రిజర్వ్ ఫారెస్ట్ లోకి ప్రవేశించడం అటవీ చట్టాల ప్రకారం తీవ్ర నేరమని అన్నారు. ఈ వ్యవహారంపై నర్సీపట్నం రెంజ్ ఆఫీసర్ విచారణ చేస్తున్నారని చెప్పారు. విచారణ నివేదికను బట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అటవీ సంపదను కాపాడడం కోసం కొన్ని సంవత్సరాలుగా ఆటవీ శాఖ బేస్ క్యాంపులు ఏర్పాటు చేసి, 24 గంటలు కాపలా పెట్టామని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరుపుతున్నామని, ఆటవీ చట్టాలను ఉల్లంఘిం చిన వారిపై కఠిన చర్యలు తప్పవని డిఎఫ్ఓ శామ్యూల్ హెచ్చరిస్తున్నారు.

రంగురాళ్ల క్వారీలో గస్తీ ముమ్మరం

ప్రజాశక్తి-గొలుగొండ:అంతర్జాతీయ మార్కెట్లో అత్యంత విలువైన రంగురాళ్లు లభ్యమయ్యే కరక రంగురాళ్ల క్వారీ చుట్టు గస్తీ ముమ్మరం చేశామని గొలుగొండ ఎస్సై రామారావు తెలిపారు. ఈ మేరకు కరక రంగురాళ్ల క్వారీ సమీపంలో శనివారం రాత్రి తన సిబ్బందితో గస్తీ తిరిగామన్నారు. అంతేకాకుండా ప్రతీ రోజు ఇద్దరు కానిస్టేబుళ్లను బీట్‌గా ఏర్పాటు చేసి రాత్రుళ్లు కూడా ఇక్కడ గస్తీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కరక క్వారీ సమీపంలో అనుమానస్పదంగా తిరిగినా, తవ్వకాలకు పాల్పడినా, ప్రయత్నించినా, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.




గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

-డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని డ్రైవింగ్ పైనే పూర్తి శ్రద్ధ ఉంచాలని , దృష్టి మరల్చి తే ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. కారు, ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు చిన్న పొరపాటు ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను తీసుకుంటుందని గుర్తించు కోవాలని సూచించారు.ఓవర్ టేక్ చేస్తున్న కొన్ని పరిస్థితులలో ఏమైనా యాక్సిడెంట్లు అయితే హాస్పటల్లో కొన్ని గంటల నుంచి సంవత్సరాలు కూడా కోలుకోలేని పరిస్థితిలో ఉంటున్నారని వివరించారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ హెల్మెట్ వాడుతూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని కోరారు. అతివేగం ప్రమాదకరమని నిదానమే ప్రధానమని తెలిపారు.





బంగారుమెట్టలో మంచు తో మాడి పోతున్న మామిడి పుత

దట్టమైన పొగమంచుతో..

జీడి మామిడి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:కొద్ది రోజులుగా పొగ మంచు అధికంగా కురుస్తోంది. దీంతో తెల్లవారుజాము నాలుగు గంటల నుండి ఉదయం 10 గంటల వరకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక లైట్లు వేసుకొని బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడుపుతున్నారు. మరో వైపు పొగ మంచువల్ల జీడి, మామిడి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలో వడ్డాది, బంగారు మెట్ట, లోపుడి, పొట్టి దొరపాలెం, కొన్నంపూడి, కేపీ అగ్రహారం, గున్నెంపూడి, దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం, మల్లం, పెదపూడి తదితర గ్రామాల్లో మెట్ట భూముల్లో రైతులు జీడి మామిడి సాగును అధికంగా చేస్తున్నారు. ప్రస్తుతం జీడి మామిడి చెట్లు పూత దశలో ఉన్నాయి. గత వారం రోజులుగా తెల్లవారుజాము నుండి పొగ మంచు కురుస్తుండడంతో పూత మాడిపోతుంది. రైతులు జీడి మామిడి తోటలో దుక్కులు దున్నించి చెట్ల మొదల్ల వద్ద పాడిలు తవ్వించే ఎరువులు వేసి లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. పూత మాడిపోవడంతో దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలోని పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా ఉదయం 7:30 వరకు పొగ మంచు పట్టడంతో రోడ్లు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పొగ మంచుతో రోడ్లపై వాహనాలు మెల్లగా కదులుతున్నాయి. ఇలాంటి సమయాల్లో కూడళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలని, అతివేగం ప్రమాదమని పోలీసులు సూచిస్తున్నారు. పొగమంచుతో అయ్యన్నపాలెం, సుబ్బారాయుడుపాలెం రహదారిలో వెళ్లే ప్రయాణికులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. బైపురెడ్డిపాలెం, గబ్బాడ, చెట్టుపల్లి తదితర ప్రాంతాల్లో పొగ మంచు దట్టంగా కమ్మేసింది. దట్టమైన మంచు కురుస్తుండటంతో వీధులు, రోడ్లు ఢిల్లీని తలపిస్తున్నాయి. పొగ మంచు ప్రభావంతో జనం బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు.



నర్సీపట్నంలో పొగమంచు

కూటమి ప్రభుత్వంలోనైనా..

సొంతింటి కల సాకారమయ్యేనా?

-గత ప్రభుత్వంలో నివాసయోగ్యం కాని స్థలం కేటాయింపు
-గృహాల నిర్మాణం చేపట్టని లబ్ధిదారులు

ప్రజాశక్తి -కోటవురట్ల:కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో 'అందరికీ ఇల్లు కల్పిస్తామని చెప్పడంతో పలువురిలో ఆశలు చిగురించాయి. గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలం దారిద్య రేఖకు దిగువన ఉన్న మహిళల పేరుతో ఇంటి స్థలాల కేటాయించనున్నట్లు ప్రకటించింది. దీంతో ఈసారైనా సొంతింటి కల సాకారమయ్యేనా?! అంటూ గ్రామంలో గత లబ్ధిదారుల్లో చర్చ సాగుతోంది,

గత ప్రభుత్వంలో ప్రధానంగా మండలంలో అన్నవరం గ్రామంలో జగనన్న కాలనీ పేరుతో ఏర్పాటు చేసిన కాలనీ స్థలం రెవెన్యూ అధికారుల నిర్వాకంతో నివాసయోగ్యం కానీ స్థలాన్ని కొనుగోలు చేసి మరీ లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే ఇక్కడ కేటాయించిన స్థలం గ్రామస్తులు తిరస్కరించడంతో ఒక్క లబ్ధిదారుడు కూడా ఇంటి నిర్మాణం చేపట్టలేదు. జగనన్న కాలనీ పేరుతో ఇక్కడ ఎంపిక చేసిన 1.30 ఎకరాల స్థలాన్ని దాదాపు 25 లక్షలతో కొనుగోలు చేశారు. 52 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అటవీ ప్రాంతాన్ని తలపించే విధంగా ఉన్న స్థలం కొనుగోలు చేయడం పట్ల అప్పట్లో అధికార ప్రతిపక్ష పార్టీలు గ్రామస్తులు సైతం వ్యతిరేకత వ్యక్తం చేశారు.అప్పట్లో భారీ ఎత్తున రెవెన్యూ అధికారులకు ముడుపులు కూడా అందినట్లు తీవ్రస్థాయిలో ఆరోపణలు వినిపించాయి. కేటాయించిన స్థలంలో లేఅవుట్ ప్రాంతాన్ని లెవెల్ చేయడంతో పాటు, సుమారు కిలోమీటర్ మెటల్ రోడ్డు, బోరు బావి, విద్యుత్ మోటర్, కరెంటు లైన్ ట్రాన్స్ఫార్మర్ ఇలా లేఅవుట్ కు దాదాపు గా 9లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలిసింది. ఇంత మొత్తాన్ని ఖర్చు చేసినా ఒక ఇంటి నిర్మాణం కూడా చేపట్లేక పోయారు. ఈసారైనా నివాసయోగ్యంగా ఉండే స్థలాన్ని కేటాయించి, నిర్మాణాలు చేపట్టి గృహాలు అందజేయాలని బాధిత లబ్ధిదారులు కోరుతున్నారు.



తుప్పలతో ఉన్న లే అవుట్

నివాస స్థలాన్ని కేటాయించాలి

గత ప్రభుత్వంలో మంజూరైన ఇంటి స్థలం నిరుపయోగంగా గ్రామానికి దూరంగా ఉండటం నిర్మించుకునేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో నిర్మాణం చేపట్టలేకపోయాం. కుటుంబ ప్రభుత్వంలోనైనా నివాసయోగ్య మైన స్థలాన్ని కేటాయించి స్కీము మంజూరు చేయాలని వేడుకుంటున్నాం..



కొమ్ము వరహాల బాబు..

అద్దె కొంపలో జీవనం

ఇల్లు నిర్మాణం చేపట్టినందుకు అధికారుల వద్దకు నాయకుల వద్దకు తిరగని రోజు లేదు.. వీరికి ఎన్నిమార్లు మొత్తుకున్నా పట్టించుకోలేదు. దీంతో పలుమార్లు అవస్థలు పడ్డాం. అద్దె కొంపలో జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి ఇంటి నిర్మాణం చేపట్టి ఆదుకోవాలి.



పెదపూడి రమణ

చాపరాయిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యటకులు సందర్శించారు. దీంతో జలపాతం పర్యాటకుల తాకిడితో కిటకిటలాడింది. అరుకు ఉత్సవాలు జరుగుతుండడంతో పర్యాటకులు తరలివచ్చారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి- నాతవరం:మండలంలోని తాండవ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వసంత పంచమిని పురస్కరించుకొని తాండవలో జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు అన్యాయం

ప్రజాశక్తి-ములగాడ : కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు అన్యాయం చేశారని సిపిఎం మల్కాపురంజోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి మండిపడ్డార. బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో శ్రీహరిపురం బస్‌స్టాప్ వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో విశాఖ రైల్వేజోన్, మెట్రో రైల్వే ప్రస్తావనే లేదని, విభజన హామీల అమలులోనూ ఆంధ్రాకు అన్యాయం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు కె.పెంటారావు, రమణ, కె.నూకరాజు, ఎస్.కె హుస్సేన్, వై.గంగాధర్, యు.రాజు, శంకర్, ఎం.కృష్ణారావు, దుర్గారావు, నీలయ్య పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న సిపిఎం నాయకులు


మాట్లాడుతున్న అసోసియేషన్ నేతలు

బడ్జెట్‌లో పెన్షనర్లకు మొండిచేయి

ప్రజాశక్తి -గాజువాక : ఇపిఎఫ్ 95 పెన్షనర్లకు బడ్జెట్‌లో కేంద్రం మొండిచేయి చూపిందని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్ పర్సన్స్ అసోసియేషన్ పెదగంట్యాడ శాఖ అధ్యక్షులు కణితి అప్పలరాజు విమర్శించారు. ఆదివారం పెదగంట్యాడలో సమావేశంలో మాట్లాడుతూ పెన్షనర్లకు ఏడాదిగా హామీలిచ్చి, బడ్జెట్‌లో కేటాయింపులు, ప్రస్తావన లేకుండా చేశారన్నారు. కనీస పెన్షన్ రూ.9వేలు అమలు, దానికి అనుగుణంగా డిఎ, వైద్యసౌకర్యం కల్పనకు పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో అసోసియేషన్ నేతలు పెట్ట గురునాథ్, కె.దీనబంధు, కె.హుస్సేన్, బి.గురు, నమ్మి అప్పలనాయుడు, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి : బొత్స



ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండి చెయ్యి చూపిందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. బీచ్ రోడ్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడ్జెట్‌లో ప్రారంభంలో మహా కవి గురజాడ పేరును తలచుకోవడం మనందరికీ గర్వ కారణమైనా, ఆ పేరు ప్రస్తావించడం తప్ప రాష్ట్రానికి ఒరిగిందీఏమి లేదన్నారు. 12 మంది ఎంపీలతో మద్దతు తెలిపిన బీహార్ ప్రయోజనం పొందింది తప్ప 16 మంది ఎంపీల మద్దతు ఉన్న ఎపికి మాత్రం ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. టిడిపి ప్రయోజనాలు వేరు, రాష్ట్ర అవసరాలు వేరు అనేది స్పష్ట మైందని పేర్కొన్నారు. పోలవరం ఎత్తు తగ్గించడం వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని చంద్రబాబు ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు. వైఎస్ జగన్ వల్లనే ప్రైవేటీకరణ అగిందని కేంద్ర మంత్రి కుమార స్వామి స్వయంగా చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. విజయసాయిరెడ్డి రాజీనామా ఆయన వ్యక్తి గతం అన్నారు.

ఆశాజనకంగా కేంద్ర బడ్జెట్ : పరశురామరాజు

కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకూ ఆశాజనకంగా ఉందని విశాఖపట్నం జిల్లా బిజెపి అధ్యక్షులు ఎంఎంఎన్.పరశురామరాజు అన్నారు. బిజెపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్యంగా కేటాయింపులు చేశారని, పేదరికం లేని సమాజం, రైతులకు పూర్తి సహకారం, తక్కువ ఖర్చుతో విద్య, వైద్యం, నైపుణ్య శిక్షణకు పెద్దపేట వేశారని తెలిపారు. ఎగుమతులను ప్రోత్సహించే విధంగా బడ్జెట్ ఉందన్నారు. టాక్స్ బెనిఫిట్ మధ్యతరగతి వర్గాలకు చాలా ఉపశమనం ఇచ్చిందని తెలిపారు. ఈ బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.మూడు లక్షల కోట్ల వరకు కేటాయింపులు జరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో డి.దానేశ్వరరావు, పి.శ్రీనివాస్, దామోదర్ యాదవ్ పాల్గొన్నారు.


పర్యటిస్తున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

అమర్‌నాథ్, ధర్మశ్రీ పర్యటన

ప్రజాశక్తి-కొత్తకోట:చోడవరం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయ కర్త కరణం ధర్మ శ్రీ రావికమతం మండలం కొత్తకోట లో ఆదివారం పర్యటించారు. సమన్వయ కర్తలు గా బాధ్యతలు చేపట్టిన వారు తొలిసారిగా మండలానికి రావడం తో స్థానిక వైఎస్ఆర్సిపి మండల నాయ కులు ఘనస్వాగతం పలికారు.స్థానిక షిరిడి సాయి బాబా ఆలయం లో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు పెనుగొండ నానాజీ తదితరులు అమర్నాథ్ తో పాటు ధర్మశ్రీ లను సత్కరించారు. అనంతరం స్థానిక వాణిజ్య వేత్త పెనుగొండ సన్యాసిశెట్టి ఇంటిలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల రాజు, ముక్కా మండల పార్టీ అధ్యక్షులు ముక్కా మహాలక్ష్మి నాయుడు, డిసిసిబి మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్య దేవ్, కె.జగ్గారావు, గ్రామ సర్పంచ్ కె.లోవరాజు, ఉప సర్పంచ్ పి దేవ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు ఇస్తున్న నిర్వాహకులు

ఘనంగా గౌరీపరమేశ్వరుల తీర్థం

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కే.నాయుడు పాలెంలో ఆదివారం గౌరీపరమేశ్వరుల తీర్థ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. అనంతరం విజేతలకు సీఎంఆర్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్ములూరు సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అయ్యన్న వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-చింతపల్లి:అభివృద్ధి ముసుగులో రాజ్యాంగం కల్పించిన గిరిజన చట్టాలను నిర్వీర్యం చేసి హక్కులను కాలరాయాలని చూడడం పాలకులకు తగదని చౌడుపల్లి సర్పంచ్ గేమ్మెల లలిత, పంచాయతీ వార్డు సభ్యుడు కోరాబు కరుణానిధి తెలిపారు. 1/70 చట్టంపై శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆ పంచాయతీ పిసా ఉపాధ్యక్షులు ఎల్ రాజారావు, వి.దాసు, వైకాపా సీనియర్ నాయకులు సాగిన గంగన్నపడాల్, జి సింహాచలం, అరడ గంగన్నదొర, ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం మోకాళ్ళపై నిలుచుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేకంగా 1/70 చట్టం చేసి గిరిజనులకు పలు ప్రత్యేక హక్కులు కల్పిస్తే వాటిని సంరక్షించ వలసిన పాలకులు అందుకు భిన్నంగా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ వైస్ చైర్మన్ రాజేష్, వార్డు సభ్యులు, రమణమ్మ, ధనుష్, పీసా కమిటీ కార్యదర్శి జి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన అరకు చలి ఉత్సవ్


అద్భుతంగా కళాకారుల విన్యాసం

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయలో మూడు రోజులపాటు నిర్వహించిన అరుకు చలి ఉత్సవ్ ఉత్సాహంగా ఆదివారం ముగిసింది.కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ నేతృత్వంలో పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమని పటేల్ ఉత్సవ్ విజయవంతనికి కృషి చేశారు. ఉత్సవ్ సందర్భంగా నిర్వహించిన వివిధ రాష్ట్రాల కళాకారుల కార్యక్రమాలు అలరింపజేశాయి.జానపద గీతాలు, సినీ గీతాలు వందేమాతరం శ్రీనివాస్ ఆలపించి అందర్నీ ఆకర్షించారు. నిత్యం బిజీగా ఉండే ఐఏఎస్ అధికారులు అరకు ఉత్సవంలో స్టెప్పులు వేయడంతో పర్యాటకులు స్థానికులు గిరిజనులు ఆశక్తిగా తిలకించారు.

అరకు చలి ఉత్సవ్ సందర్భంగా ముగింపు రోజు ఆదివారం రాత్రి వివిధ సంస్కృతిక కార్యక్రమాలు ఉత్తేజపరితంగా ముగిసింది. ఉత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన్ ఓపి అగర్వాల్ బృందం ట్రేకింగ్ నిర్వహించారు. అలాగే గిరిజన సంస్కృతిక మ్యూజియంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా కలెక్టర్, అధికారులు తిలకించారు. అనంతరం సాయంత్రం యధావిధిగా వివిధ సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శ్రీ విజయ భాస్కర్ తాల వైద్యం, పాశ్చాత్య గానం -నృత్యాలు, షాడో నృత్యం, జానపద పాటలు,ఆర్కెస్ట్రా, మైండ్ రీడింగ్ మెంటలిస్ట్ ప్రదర్శన, లేజర్ షో వంటి వినోద కార్యక్రమాలు అందరిని కనువిందు చేశాయి. చలి ఉత్సవ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐఏఎస్ అధికారులు బహుమతులు, మెమొంటోలు ప్రధానం చేశారు.

ట్రెక్కింగ్‌తో జోష్

పర్యాటకులలో ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని ధైర్యాన్ని నింపటానికి ఏర్పాటుచేసిన ట్రెక్కింగ్‌లో పలువురు యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం సుంకర మెట్ట కాఫీ ట్రయల్ నుండి సుమారు మూడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేసి పర్యాటకులలో ధైర్యాన్ని నింపారు. ట్రెక్కింగ్ కు మధ్యప్రదేశ్‌కు చెందిన ఓపి అగర్వాల్ బృందం సపోర్ట్ చేసింది.విశాఖపట్నం జిల్లా జడ్జి ఎం గిరిధర్, డివిజనల్ ఫారెస్ట్ అధికారి సందీప్ రెడ్డి, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం క్యూరేటర్ పి శంకర్రావు, తదితరుల ఆధ్వర్యంలో ట్రెక్కింగ్ సజావుగా సాగింది. ట్రెక్కింగ్‌లో పాల్గొన్నవారు రకరకాల పక్షుల కూతలు, పలురకాల మొక్కల సువాసనలు, స్వచ్ఛమైన గాలి, వివిధ రకాల మెడిసినల్ ప్లాంట్స్ ఫీల్ పొందామని, ప్రకృతి ఒడిలో మై మర్చిపోయామని ఎంతో పరవశం తో చెప్పారు.


క్యాట్ వాక్ చేస్తున్న మహిళలు

ప్రత్యేక ఆకర్షణగా ముగ్గుల పోటీలు

అరకు చలి ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. పాలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు ఎంతో ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. పలువురు మహిళ అధికారులు కూడా ఈ ముగ్గుల పోటీలలో పాల్గొని అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ పోటీలలో మొదటి బహుమతి బి.దేవి, రెండవ బహుమతి ఎల్.మధు శ్రీ, మూడవ బహుమతి యు.సునీత సాధించగా మూడేళ్ల చిన్నారి చిన్మయి పోటీలు పాల్గొని అందర్నీ ఆకర్షించడంతో ఆమెకు కన్సోలేషన్ బహుమతిని అందజేశారు.విజేతలకు బహుమతులు అందజేసిన జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించిందని, స్థానికులే కాకుండా పర్యాటకులు కూడా ముగ్గుల పోటీల్లో పాల్గొనడం గొప్ప విషయమని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎఎస్ఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పిఒ విభిషేక్, డిఆర్ఒ పద్మలత పాల్గొన్నారు.